వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్

- రాజకీయాల్లో ఊసరవెల్లి అంజిబాబు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


గొల్లవానితిప్ప సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: రాజకీయాల్లో ఊసరవెల్లి జనసేన అభ్యర్థి పులపర్తి అంజిబాబు అని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, లోసరి గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన అభ్యర్థి పులపర్తి అంజిబాబు ఇప్పటికే కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ కండువాలను మార్చుకుని మళ్లీ జనసేన కండువా కప్పుకుని రాజకీయాల్లో ఊసరవెల్లిగా మారారని విమర్శించారు. ఆయన పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పని చేసి నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి సాధించారని ప్రశ్నించారు. తాను 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి ఇప్పటివరకు నేను చేసిన అభివృద్ధి పనులు ల్యాండ్‌మార్కుగా ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులతోనే రేపటి రాష్ట్ర ప్రగతి ఆధారపడి ఉందని తలచి సీఎం జగన్ సర్కార్ పాఠశాలలను నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేశారని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. వైద్యరంగంలో ఆరోగ్య శ్రీ రూ. 5 లక్షలు నుంచి 25 లక్షలకు పెంపు, అంతేకాకుండా ఇతర రాష్ట్రాల్లో కార్పొరేట్ వైద్యం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నెరవేరని 600 పైగా హామీలు ఇచ్చి అధికారమొచ్చాక అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ప్రజలకు వివరించాలని సూచించారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను, రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసి రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న తనకు ప్రజల అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి మోటుపల్లి చక్రధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్పర్తి సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సర్పంచ్‌లు చిల్లే వెంకటేష్, ఒడుగు ముత్యాలరావు, జల్లా కొండయ్య, గుద్దటి వెంకట రామారావు, ఎంపీటీసీ తిరుమాని తులసీరావు, మండల వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవానీ, రేవు రాంబాబు, యాతం రామస్వామి, గుద్దటి రాంబాబు, జవ్వాది గణేష్, తిరుమాని ధనంజయ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేంపాడు వలంటీర్ శృతి రాజీనామా


పంచాయతీ కార్యదర్శి రాజీనామా అందజేస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని వేంపాడు గ్రామ సచివాలయ పరిధిలో వలంటీర్‌గా సేవలందిస్తున్న గేదెల శృతి మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు అందజేశారు.ఈ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థపై టీడీపీ వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించినప్పుడు ఈ టీడీపీ నాయకులు ఏమయ్యారని ఆమె ప్రశ్నించారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమను ప్రజలకు సేవలందించకుండా దూరం చేయడం సరికాదన్నారు. దీనివల్ల వృద్ధులు, దివ్యాంగులు, అవ్వతాతలు, తీవ్ర ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

50 మంది వలంటీర్ల రాజీనామా


అండలూరులో రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న వలంటీర్లు

వీరవాసరం: వీరవాసరం మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు తమ తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం గ్రామ సచివాలయ వ్యవస్థ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవ్వ తాతలకు పెన్షన్‌తో పాటు ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి వారికి సేవా దృక్పథంతో పనిచేయడం జరిగిందన్నారు. వీరవాసరం మండల వ్యాప్తంగా 50 మంది వలంటీర్లు గ్రామ సచివాలయాలు వద్ద రాజీనామా పత్రాలను అందజేశారు.

దంతాలను సురక్షితంగా కాపాడుకోవాలి


కేవీకేలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం కృషీవిజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తణుకు నార్లస్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నార్ల సుషీల్, డాక్టర్ నార్ల పద్మజారాణి, డాక్టర్ బౌమిక్, డాక్టర్ దీపీకా వైట్ల వైద్య సేవలు అందించారు. కేవీకే,మత్స్య పరిశోధనాకేంద్ర శాస్త్రవేత్తలు, పలువురు విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంతాల సంరక్షణపై వైద్యులు పలు సూచనలు సలహాలను అందించారు. దంతాల సంరక్షణ అనేది చాలా అవసరమని ఉదయం, రాత్రి తప్పనిసరిగా దంత సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే అప్పుడప్పుడూ దంతాల ఆరోగ్యంపై వైద్యులను సంప్రదించాలని అన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడంతో సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు. మంగళవారం ఆచంట నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తప్పుదారి పట్టించే సమాచారాన్ని, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు ఎవరూ పెట్టవద్దని, పార్వర్డ్ చేయకూవడదని తెలిపారు. అతిక్రమిస్తే ఐపీసీ 153(ఏ) క్రింద చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పుడు వార్త ప్రచారాలకు పాల్పడే వారిని, రెండు వర్గాల మధ్య విద్వేషాలకు దారి తీసే, విద్వేషాలు సృష్టించే సమాచారాన్ని వైరల్ చేసినా, ఎవరైనా ప్రలోభ పెట్టినా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ఫోన్ నం.08814 297299కు సమాచారం అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల తనిఖీలు

పాలకొల్లు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పరిమితి కన్నా ఎక్కువ నగదు రవాణా చేస్తే దానికి సంబంధించిన ఆధారాలు తనిఖీ సమయంలో అధికారులకు చూపించి సహకరించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొర్రా గోవింద రాజులు తెలిపారు. పాలకొల్లు పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వాహన యజమానుల వద్ద ఉన్న నగదు పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సహాయ అధికారులు ఎస్.సీతారాముడు, పి.రాజశేఖర్, ఎంపీ దుర్గాప్రసాద్, ఎం.సునీల్‌కుమార్ వాహనాలను తనిఖీ చేశారు.

వ్యక్తికి గాయాలు

భీమవరం: భీమవరం రెండో పట్టణంలోని ప్రకాశ్ నగర్ వద్ద నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గాయపడినట్లు గూడూరి శివనాగరాజు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. బాధితుడు ప్రస్తుతం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఈ ఘటనపై ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతోనే ఆరోగ్యమని వాకర్స్ అధ్యక్షుడ దూలం నాగరాజు అన్నారు. ఆయన అధ్యక్షతన ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నెలవారి సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు అందజేశారు. యోగా తరగతులకు అందరు హాజరకావాలని కోరారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు. ఈ సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడ కేవీ కృష్ణారావు, కార్యదర్శి గురుమూర్తి, కోశాధికారి మల్లారెడ్డి సారధి, అనిల్, రాగిరెడ్డి నాగ వర ప్రసాద్, ప్రవా శ్రీనివాస్, మాకా శ్రీనివాసరావు, పి.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు లేకుండా క్షేత్రస్థాయి ప్రణాళిక


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుజాత


పాలకోడేరులో మాట్లాడుతున్న వాణి విజయరత్నం

ఆకివీడు: మాతృ మరణాలు జరగకుండా క్షేత్ర స్థాయిలో ప్రణాళికలు రూపొందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంగా కృషి చేయనున్నాయని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి.సుజాత రాణి చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రెండు శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన సమావేశంలో గర్భవతి అని తెలిసిన వెంటనే రెండు శాఖల సిబ్బంది ఆమె పేరును నమోదు చేయాలన్నారు. రక్త హీనత ఉన్న గర్భిణులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ గర్భిణిని అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశ దత్తతు తీసుకోవాలని సూచించారు. గర్భిణి సుఖప్రసవం జరిగే వరకూ వారిదే బాధ్యతగా ఉండాలన్నారు. పుట్టిన బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయాలని సూచించారు. గర్భిణుల్లో అత్యధిక ఆరోగ్య లోపాలున్న వారిని గుర్తించి, ప్రతీ రోజూ వారికి వైద్య పరీక్షలు, మందులు అందజేస్తూ సుఖ ప్రసవం జరిగే విధంగా సహకరించాలన్నారు. పిల్లల మరణాలు జరగకుండా చూడాలని, వారి ఆరోగ్యానికి తగిన సూచనల్ని ఆమె అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ బాలు నాయక్, సీడీపీఓ వి.వాణీ విజయరత్నం, పీహెచ్‌సీ వైద్యులు పీఆర్.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ప్రసవ సమయంలో మాతా శిశు మరణాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వాణీ విజయరత్నం సూపర్‌వైజర్‌లను, అంగనవాడి కార్యకర్తలను కోరారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యాలయం లో మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చిన్నమిల్లి రంగమ నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

పాలకోడేరు: పాపన్న గౌడ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని జువ్వలపాలెం మాజీ గ్రామ సర్పంచ్ కొండేటి శివకుమార్ అన్నారు. స్థనిక పాలకోడేరులో గౌడ్ సెంటర్ లో.. పురాణ దిమ్మ వద్ద మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగర సుబ్బారావు, యిర్రింకి శ్రీనివాస్, కారింకి సాయిబాబు, చిటికెన పుల్లయ్య పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

నరసాపురం రూరల్: రంజాన్ మాసం సందర్భంగా నరసాపురం అంజుమన్ భవనంలో మంగళవారం పేద ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజుమన్ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ మాట్లాడుతూ లోకాన్ని సృష్టించిన దేవుడు.. మనిషి నియంత్రణ కోల్పోయే ప్రమాదం నుంచి రక్షించాలని ప్రతి సంవత్సరం ప్రత్యేకించి ఒక నెల పాటు మనిషిని సంస్కరించేందుకు రంజాన్ మాసాన్ని సృష్టించాడన్నారు. నెల రోజులపాటు తనకు అత్యవసరమైన ఆహార పానీయాలు వదిలి కనీసం ఉమ్మి కూడా మింగకుండా పరమనిష్ఠతో ఉంటాడన్నారు. నిరంతరం దైవ ప్రార్థనలో ఉంటూ ప్రాపంచిక విషయాలకు దూరంగా ఉంటారన్నారు. సంవత్సరం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలకు చెందిన పేదలకు దుస్తులు పంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ దావూద్ ఖాన్, ఎండీ మౌలాలిఖాన్, బడేవలి, అయూఖాన్, ఖాజా, సయ్యద్ వలి, బషీర్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

చిన్నారులపై జాగ్రత్తలు తీసుకోవాలి

అత్తిలి: ప్రసవం అనంతరం తల్లీబిడ్డ సురక్షంగా జీవించాలంటే వైద్యుల సలహాలు సూచనలు విధిగా పాటించాలని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బి ప్రమోదకుమారి అన్నారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి మాట్లాడుతూ లబ్ధిదారుల గృహ సందర్శనకు వెళ్లినప్పుడు ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. సూపర్ వైజర్ కె కుమారి మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలను తరచుగా సందర్శించాలన్నారు. సీహెచ్ఓ సి మురళి, హెచ్ఈ జి ప్రమీలాదేవి, ఏఎన్ఎం, ఆశా, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి


భీమవరంలో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా తల్లిదండ్రులు ఓటు వేసే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి జి.సీహెచ్ ప్రభాకర్ అన్నారు. భీమవరం పాట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్లో మంగళవారం భవిష్యత్ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్య ఓటర్లు వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల వారికి ఎన్నికల విషయాలను చేర్చడమే లక్ష్యంగా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రధానంగా తమ తల్లిదండ్రులు, బంధువులతో ఓటు వేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ రకాల యాప్‌లు, ఓటర్లు హెల్ప్ లైన్ యాప్స్ పని తీరును వివరించారు. ఈ యాప్‌లను విద్యార్థులు తమ మొబైల్స్‌లో డౌన్లోడ్ చేసుకుంటే వారికి ఓటింగ్ కి సంబంధించిన అన్ని విషయాలు తెలుస్తాయని ప్రభాకర్ వివరించారు. గత ఎన్నికల్లో జిల్లా ఓటింగ్ 82 శాతం కాగా దాన్ని 96 శాతానికి పెంచే విధంగా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో స్థానిక వీరమ్మ చెరువు వరకు ఓటుకు నోటు వద్దే వద్దు అనే నినాదాలతో వీరమ్మ పార్కు వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం జె సుధారాణి, స్వీప్ టీమ్ సభ్యులు చరణ్ తేజ్, సప్పా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం


భీమవరంలో దివ్యాంగ పిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమవరం: పట్టణంలోని గాలి రామయ్య మున్సిపల్ స్కూల్ ఆవరణలోని అర్బన్ భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రం వద్ద డివిజన్ స్థాయిలో దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. మంగళవారం జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి శ్యాంసుందర్ మాట్లాడుతూ వివిధ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగుల పిల్లలకు స్కూల్‌కు వెళ్లడానికి అవసరమైన ఉపకరణాలు నిర్ధారిస్తారని తెలిపారు. వీటిని సమగ్ర శిక్ష ద్వారా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ వివిధ రకాల అలవెన్సులు విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, సహాయ కోఆర్డినేటర్ టి శ్రీనివాస్, మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


కోళ్లపర్రులో ముసలమ్మను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ ఉండి అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజు.

ఆకివీడు: గ్రామ దేవత ప్రతి ఏటా వార్షికోత్సవంలు నిర్వహించడంతో అమ్మ శాంతించి ప్రజలకు ఆశీస్సులందిస్తుందని ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో పుంతలో ముసలమ్మ, పోతురాజు ఆలయాల 8వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ అమ్మవార్ల ఆలయాలు, గ్రామాల్లోని దేవాలయాలు దేదీప్యమానంగా వెలుగొందుతుంటే ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), వైఎస్సార్ సీపీ ఆకివీడు పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్, కఠారి కేశవరావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు దింటకుర్తి నాగేశ్వరరావు, కేశిరెడ్డి దిలీప్, కేశిరెడ్డి వాసు, అల్లూరి నాగరాజు, పల్లి షడ్రక్, యండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని పీవీఎల్.నర్సింహరాజు సందర్శించి, దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించారు.

చంద్రబాబు కుట్రలను ప్రజలు గుర్తించాలి


ఆకివీడు: పట్టణంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీ లక్ష్మి


కాళ్ల: పెదఅమిరం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆకివీడు: ఎన్నికల ముందే చంద్రబాబు కుట్రలు బయటపడుతున్నాయని, ప్రజలు వాటిని గుర్తించాలని ఉండి నియోకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 3,15,17 వార్డుల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి పథకాలను తుంగలో తొక్కిన చంద్రబాబు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పథకాలను కూడా నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నారన్నారు. దానిలో భాగమే వలంటీర్లను పింఛన్ పంపిణీకి దూరం చేశారని ఆరోపించారు. వలంటీర్లంటే చంద్రబాబుకు గిట్టడంలేదన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో విజయం సాధిస్తే జగన్ మోహన్ రెడ్డి అమలుజేసిన పథకాలన్నింటినీ రద్దు చేస్తారని ప్రజలు గమనించాలన్నారు. జగన్ అమలుజేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా బలపడుతున్నారని శ్రీలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, పట్టణ వైఎస్సార్ సీపీ కమిటీ అధ్యక్షులు అంబటి రమేష్, కౌన్సిలర్‌లు కటికతల జాన్ వెస్లీ, దొడ్డి జగదీష్, జిల్లా పెద్దిరాజు, గేదల అప్పారావు, బూత్ కన్వీనర్లు అందే రాజబాబు, జేసీఎస్ కన్వీనర్ శిరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఆర్థిక అభివృద్ధి

కాళ్ల: ప్రతి పేదవాడి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి గా చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, జవ్వాది సత్యనారాయణ ప్రజలను కోరారు. మండలంలోని పెద అమిరం గ్రామంలో మంగళవారం గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉండి నియోజకవర్గంలో పీవీఎల్ నరసింహరాజు ను ఎమ్మెల్యే గా అత్యధిక మెజార్టీ తో గెలిపించుకోవాలని కోరుతూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గా పివిఎల్ నరసింహారాజు ను ప్రకటించడంతోటే ఉండి నియోజకవర్గంలో గెలుపు ఖాయం అయిందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఉండి ఎమ్మెల్యే గా పీవీఎల్ నరసింహరాజును నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామంలో ఇంటింటికి తిరిగి అభ్యర్థించారు.

శ్రీశైలం నిత్యాన్నదాన కమిటీలో ఆకివీడు ప్రతినిధులు


శ్రీశైలం దేవస్థానంలోని శ్రీకేతేశ్వర మేదర నిత్య అన్నదాన సత్రం కమిటీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆకివీడు ప్రతినిధులు

ఆకివీడు: శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని నిత్యాన్నదాన కమిటీలో ఆకివీడుకు చెందిన పలువురు ప్రతినిధులు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మార్చి 31న శ్రీశైలంలో జరిగిన కేతేశ్వర మేదర నిత్య అన్నదాన సత్రము కమిటీలో తమకు స్థానం లభించడం అదృష్టమని కమిటీ సహాయకార్యదర్శి, వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షులు, ఆకివీడు మేదర సంక్షేమ సంఘం అధ్యక్షుడు సందా కేశవరావు మంగళవారం స్థానికంగా విలేకర్లకు చెప్పారు. కేతేశ్వర మేదర నిత్య అన్నదాన కమిటీలో తనతో పాటు ఆకివీడు మేదర సంఘం ప్రతినిధులు కందికట్టు వీర బ్రహ్మానందరావు, జొరిగే నాగేశ్వరరావు, ధూళిపాళ్ళ ఉదయ భాస్కర్, జొరిగే సత్యన్నారాయణలు సభ్యులుగా ఎన్నుకున్నారని తెలిపారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారం శ్రీశైలం ఆలయ ప్రాంగణంలోని నిత్యాన్నదాన మండపం వద్ద జరిగిందన్నారు. నూతన కమిటీ ప్రతినిధులు జిల్లా అధ్యక్షులు కొండా కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించినట్లు కేశవ చెప్పారు.

ముఖదారమ్మ జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువుగట్టున ఉన్న శ్రీ ముఖదారమ్మ జాతర మహోత్సవాలు సందర్భంగా అమ్మవారి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కుంపట్ల చిన్నరాజా మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయన్నారు. 15 వరకూ వారం రోజులు పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడ్డాల ఏడుకొండలు చెక్కా కృష్ణ, కొలుకులూరి కృష్ణ, కొల్లంశెట్టి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ పేదలపై కక్ష సాధింపే

అత్తిలి: వృద్ధులు, వికలాంగులకు వలంటీర్‌ల ద్వారా ఇంటివద్దకే ఫించన్ ఇవ్వకుండా నిలుపుదల చేయడం ముమ్మాటికీ కక్ష సాధింపేనని మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం అత్తిలిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన నిమ్మగడ్డ రమేష్ ద్వారా కోర్టులో పిటిషన్ వేయించి ఎన్నికల కమిషన్ ద్వారా వలంటీర్లు పింఛన్లు అందజేయకుండా చేయించారన్నారు. మరో పక్క రేషన్ సైతం వలంటీర్ల ప్రమేయం లేకుండా చంద్రబాబు అడ్డుకున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మెస్థితిలో లేరన్నారు.